క్లుప్తంగా

'జాగృతి' జిల్లా అధ్యక్షుడిగా మూల రాము నియామకం



ఎల్కతుర్తి : భారత జాగృతి జిల్లా అధ్యక్షుడిగా భీమదేవరపల్లి మండలంలోని ములకనూర్ గ్రామానికి చెందిన మూల రాము గౌడ్‌ను నియమిస్తూ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాముగౌడ్ విలేకరులతో మాట్లాడారు. జాగృతి బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తన నియమకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ గ్రామంలోని పెద్దాపూర్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు పల్లవి, సావిత్రి, హన్సిక, పూజ ఈనెల 26, 27 తేదీల్లో నర్సంపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి టార్గెట్ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఆ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అక్షయ, పల్లవి, 10వ తరగతి చదువుతున్న సావిత్రి, హన్సిక, పూజ, శివ చైతన్య రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచారు. కాగా పల్లవి, సావిత్రి, హన్సిక, పూజ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ స్టెల్లా షారోన్‌రోజ్ సోమవారం అభినందించారు.

క్రీడల్లో రాణించాలి



దామెర : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ రామాదేవి ఆకాంక్షించారు. సూర్యకిరణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలోని 80 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆమె సోమవారం క్రీడా దుస్తులు ఉచితంగా అందించి మాట్లాడారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి బాటలు వేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సూర్యకిరణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సూరు విద్యాసాగర్‌రెడ్డి, డీసీడీఓ సునీత, ఎంపీపీ కాగితాల శంకర్, సర్పంచ్ శ్రావణ్య అనిల్, డీఎస్‌ఓ శ్రీనివాసస్వామి, ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి ప్రాధాన్యం



శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక గడచిన తొమ్మిదిన్నరేళ్లుగా సీఎం కేసీఆర్ దళితుల సంక్షేమానికి, అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. దళితులు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ధ్యేయంతో దళిత బంధు పేరుతో రూ.10 లక్షల సాయం అందించే పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారని చెప్పారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు ఎలీషా, వినయ్, శివ, అఖిల్, నవీన్, రాజేష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఓపై విచారణ

సంగెం : ఈజీఎస్‌లో ఏపీఓగా పనిచేస్తున్న లక్ష్మిపై ఏపీడీ సాయిచరణ్ విచారణ చేపట్టారు. ఈ నెల 10న ఏపీఓ ఇబ్బందులకు గురిచేస్తోందని డీఆర్‌డీఓ సంపత్‌రావుకు లిఖితపూర్వకంగా మండల ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు చేశారు. డీఆర్‌డీఓ ఆదేశాల మేరకు సోమవారం సంగెం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీడీ సాయిచరణ్ జేఈ, టెక్నికల్ అసిస్టెంట్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లను విడివిడిగా, ఫీల్డ్ అసిస్టెంట్లను ఏపీఓ ఏ రకమైన ఇబ్బందులు పెట్టారని వాంగ్మూలాలు సేకరించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏపీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల చేయూత

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలికి చెందిన మంద కళ్యాణి భర్త రమేశ్ ఇటీవల మృతిచెందాడు. కాగా కళ్యాణితో 2007–08లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు (మిత్రులు) రూ.44 వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని సోమవారం ఆమెకు అందించారు. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఐలోని తిరుపతి, ఏకంబ సురేశ్, గట్ల శ్రీకాంత్, మార్త పృథ్వీరాజ్, అల్లం ప్రశాంత్, జన్ను సుమలత, గొర్రె కళ్యాణి, మంద సుమలత, మంద రమ, లక్ష్మి, రాధిక పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు, కోతులు, పందులు



రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు



గుంపుగా తిరుగుతున్న కోతులు



మండల కేంద్రంలో పందులు

ఎల్కతుర్తి : ఓవైపు మండలంలోని పల్లెలు పచ్చదనంతో పరవశిస్తున్నాయి. మరోవైపు కుక్కలు, కోతులు, పందులతో జనం బెంబేలెత్తుతున్నారు. రోడ్లపై నడవాలంటేనే బాబోయ్.. కుక్కలు, కోతులు, పందులు హడలెత్తిస్తున్నాయి.. అంటూ పలువురు జంకుతున్నారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లోను కుక్కలు, కోతులు, పందులతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా వాటిని నివారించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటునానరు. పందుల పెంపకందార్లకు అధికారులు నోటీసులిచ్చినా బాధ్యులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

మండల కేంద్రంలో కోతుల బెడద నానాటికీ తీవ్రమౌతోంది. పలు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాల నుంచి మొదలుకొని ఏది దొరికితే అది ఎత్తుకెళ్లడమే కాకుండా అడ్డుకునేందుకు యత్నించే వారిపై దాడికి దిగుతున్నాయి. ఇళ్ల కప్పుకున్న పెంకులూడదీస్తూ విధ్వంసం సృష్టిస్తున్నాయి. కోతుల సంఖ్య భారీగా పెరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఏ గల్లీలో కోతులు గుంపులుగా సంచరిస్తూ కనిపిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. మండలంలో ఇటీవల కోతుల బారిన పడి పలువురు వృద్ధులు, పిల్లలు గాయాల పాలైన విషయం తెలిసిందే. ఇళ్లలో కూరగాయలు తరిగే సమయంలో మహిళలపై కోతులు గుంపుగా దాడి చేసిన ఘటనలూ ఉన్నాయి. ఎంపీటీసీ కడారి రాజు గతేడాది స్పందించారు. కోతులను పట్టించారు. అయినా మళ్లీ తాజాగా కోతుల సంఖ్య మళ్లీ పెరిగింది. కుక్కలు కూడా పలు వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతూ పాదచారులపైనే కాకుండా వాహనదారులపైనా దాడులకు యత్నిస్తూ జనాన్ని వణికిస్తున్నాయి. పలు కుక్కలు రోగాల బారిన పడి జనం మీదకు దాడికి యత్నిస్తుండడం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. రోగాల బారిన పడే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. ఇక పందుల సంచారంతో మురికి కాల్వలు కంపుకొడుతున్నాయి. ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదాలు మెండుగా ఉన్నాయి. పలువురు ఆస్పత్రుల పాలై చికిత్స పొందుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కలు, కోతులు, పందుల బారి నుంచి కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా సేవలు



విద్యార్థులతో శ్రీకాంత్, ఎంఈఓ, తదితరులు



విద్యార్థినితో రాజీవ్

కమలాపూర్ : విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా పదేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు తాను స్కూల్ బ్యాగులు, ఇతర సేవలు అందిస్తున్నట్లు హనుమకొండలోని డీఎస్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దూడ శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని టాకీస్ ఏరియా మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఆయన సోమవారం స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేసి మాట్లాడారు. పేదరికం నుంచి వచ్చిన తాను చిన్నప్పటి నుంచి కష్టపడి చదివినట్లు తెలిపారు. శనిగరం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యను అభ్యసించి ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నట్లు చెప్పారు. పదేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందించడంతోపాటు సహాయ సహకారాలు అందిస్తున్న శ్రీకాంత్‌ను ఎంఈఓ రాంకిషన్‌రాజు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పీడబ్ల్యూసీ.పవన్, టి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు జె.కాంతయ్య, సీహెచ్.మమత, అంగన్‌వాడీ టీచర్ పద్మకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధి సామర్థ్యాలపై అధ్యయనం

మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థుల అభ్యసనాభివృద్ధి సామర్థ్యాలను డైట్ కళాశాల విద్యార్థి ఆర్.రాజీవ్ అధ్యయనం చేశారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు తెలుగు, గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా తెలుగు సబ్జెక్టుకు సంబంధించి రాజీవ్ సోమవారం 'టాంజరిన్ యాప్'లో విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, టాయిలెట్ల పరిశుభ్రతపై సెల్ఫ్ అసెస్మెంట్ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంకిషన్‌రాజు, హెచ్‌ఎంలు పీడబ్ల్యూసీ పవన్‌కుమార్, టి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు జె.కాంతయ్య, సీహెచ్.మమత తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశం



పరకాల : ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో డిగ్రీలో చేరేందుకు నేటి నుంచి దోస్త్ ప్రత్యేక విడత ద్వారా చివరి అవకాశం ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆ కళాశాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక విడతలో భాగంగా విద్యార్థులకు ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకామ్ (సీఏ), బీఎస్సీ (మ్యాథ్స్), కంప్యూటర్, లైఫ్ సైన్సెస్) కోర్సులు ఉన్నాయని చెప్పారు. బీఏ కంప్యూటర్స్‌లో 29 సీట్లు, బీకామ్ కంప్యూటర్స్‌లో 20 సీట్లు, బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో 57 సీట్లు, బీఎస్సీ మ్యాథ్స్, కంప్యూటర్స్‌లో 24 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆగస్టు 28 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు సెప్టెంబర్ 4 వరకు తప్పకుండా రిజిస్ట్రేషన్ తీసుకోవాలని, 5న వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని, 9న సీట్లు కేటాయిస్తారని తెలిపారు. సమావేశంలో దోస్త్ కోఆర్డినేటర్ ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



శాయంపేట : ధ్యానం చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ మెడిటేషన్ సొసైటీ సభ్యులు స్రవంతి, తిరుపతి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధ్యానం చేసే విధానాన్ని విద్యార్థులకు వారు వివరించారు. ధ్యానానికి ఉన్న ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతీరోజు ఉదయం లేవగానే ధ్యానం చేస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. ధ్యానం చేసే సమయంలో పాటించాల్సిన మెళకువలు తెలిపారు. ప్రతీరోజు ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వనం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, షౌకత్ అలీ, సదానందం, అజీముద్దీన్, సత్యప్రసాద్, ఉదయశ్రీ, నర్సింగరావు, రాజేష్, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్ టికెట్ 'మాదిగ'కే ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ధర్మసాగర్ (వేలేరు) : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాదిగ కులానికి చెందిన నాయకుడికే టికెట్ ఇవ్వాలని ఎంహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టె పద్మయ్య డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వేలేరులో 'మాదిగ ముద్దు.. బైండ్ల వద్దు..' అంటూ నినాదాలు చేస్తూ సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్, పద్మయ్య మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎమ్మెల్యే పదవికి తాటికొండ రాజయ్య గతంలో రాజీనామా చేసిన క్రమంలో ఆయనకే బీఆర్‌ఎస్ పార్టీ అసెంబ్లీ టికెట్ కేటాయించాలని చెప్పారు. మాదిగ కులస్తులకు పెద్దన్నగా, నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యేగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజయ్యను కాదని కడియం శ్రీహరికి టికెట్ ఇస్తే ఉరుకునేది లేదన్నారు. కడియం శ్రీహరి ఎమ్మెల్సీగా కొనసాగుతూ ఐదేళ్ల కాలపరిమితి ఉన్నప్పటికీ ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించడం సరికాదన్నారు. రాబోయే ఎన్నికల్లో రాజయ్యకే మాదిగ కులస్తుల మద్దతు ఉంటుందని చెప్పారు. మోసపూరితంగా టికెట్ తెచ్చుకుంటే కడియం శ్రీహరిని ఓడిస్తామని తేటతెల్లం చేశారు. టికెట్ ఇచ్చే విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ పునరాలోచించి తాటికొండ రాజయ్యకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత, ప్రజాసంఘాల నాయకులు, పాల్గొన్నారు.

పోచమ్మ, ముత్యాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన



పూజ చేస్తున్న రవీందర్‌రావు తదితరులు



దేవతా విగ్రహాలను ఊరేగిస్తున్న పురోహితులు

ఐనవోలు : పురోహితులు అయినవోలు మల్లికార్జున శర్మ, మధుకర్ శర్మ, కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో బుధవారం వరకు మండల కేంద్రంలో పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయాల పునర్నిర్మాణం, దేవతల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగనున్నాయి. అందులో భాగంగా సోమవారం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అఖండదీప స్థాపన, సోడష మాతృకారాధన, పంచగవ్య మేళన, అంకురారోపణ, వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండప ప్రధాన కళశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, వాస్తు పరియగ్నికరణం, విగ్రహాల ఊరేగింపు, జలాధివాసం నిర్వహించి హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాల వితరణ నిర్వహించారు. నేడు (మంగళవారం) దేవత మూల మంత్ర హవనములు, ధాన్య, పుష్ప అధివాసాలతోపాటు అష్టదిగ్బంధనం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మధుమతి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ మునిగాల సమ్మయ్య, సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఎంపీటీసీ కల్పన, ఉపసర్పంచ్ అద్దగూడి సతీష్, వడిచర్ల శ్రీనివాస్, పల్లకొండ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

31న రాఖీ పౌర్ణమి

పరకాల : ఈనెల 31న రాఖీ పౌర్ణమి వేడుకలను జరుపుకోవాలని ప్రముఖ శైవాగమ పండితులు, బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఏ సమయంలోనైనా మహిళలు తమ సోదరులకు రాఖీలను కట్టవచ్చని పేర్కొన్నారు. నిర్దిష్ట సమయం ఏమీ లేదని స్పష్టం చేశారు.

పశువైద్య శిబిరం

గీసుకొండ : ధర్మారంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు, లంపిస్కిన్ వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ మందును పశు వైద్యాధికారి వడ్డేపల్లి రమేష్ వేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సుంకరి శివ, కుమారస్వామి, పీఏఎస్ రమేష్, జేవీఓలు నాగరాణి, కవికుమార్, ఎల్‌ఎస్‌ఏ రామ్మోహన్, గోపాలమిత్ర సుధీర్ పాల్గొన్నారు.

లక్ష్యం ఎంచుకుని కృషి చేస్తేనే రాణింపు

హసన్‌పర్తి: విద్యార్థినులు లక్ష్యాన్ని ఎంచుకుని అందుకు అనుగుణంగా కృషి చేస్తేనే రాణిస్తారని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు కే.దామోదర్ అన్నారు. హసన్‌పర్తిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల డిగ్రీ గురుకుల కళాశాలలో 'సంస్కార వికాస శిక్షణ'పై సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువులపై ఆసక్తి పెంచుకుంటూనే వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మహనుభావుల స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సంస్థ అధ్యక్షుడు దామెర నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థినులు అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ వింధ్యారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు శ్రీలత, గౌసియా, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం శ్రమించడమే విజయ రహస్యం



మాట్లాడుతున్న కటకం నరేశ్

గీసుకొండ : విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించడమే విజయ రహస్యమని ఇంపాక్ట్ ఫౌండేషన్ మోటివేషనల్ స్పీకర్ కటకం నరేశ్ అన్నారు. సోమవారం ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటమి అంటే గట్టిగా ప్రయత్నించకపోవడమేనని అన్నారు. యువతకు ప్రేరణగా నిలిచిన స్వామి వివేకానందం, అబ్దుల్ కలాం లాంటి మహనీయుల జీవిత చరిత్రల్లో జరిగిన యదార్థ ఘటనలను వివరించి స్ఫూర్తి రగిలించాలన్నారు. హెచ్‌ఎం సుజాత, సమ్మిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు కృషి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్, నాయకులు

ఐనవోలు : సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదల ఆరోగ్య పరిరక్షణకు చొరవ తీసుకుంటున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కొల్లూరి దయాకర్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం సాయం కోరగా అతనికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.50 లక్షల లెటర్ ఆఫ్ కాన్సెంట్ (ఎల్‌ఓసీ)ని ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే రమేష్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దయాకర్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్న విషయం తెలిసి తాను ప్రత్యేక చొరవ తీసుకుని ఎల్‌ఓసీ మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మధుమతి, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ మునిగాల సమ్మయ్య, సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఎంపీటీసీ కల్పన, సొసైటీ వైస్ చైర్మన్ బాబు, నాయకులు వెంకన్న, బాబు, పరమేశ్, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

60 శాతం సీట్లే ప్రధాన ఎజెండా



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రవికృష్ణ, తదితరులు

- 'బీసీ' సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ

పరకాల : బీసీ సామాజికవర్గానికి 60 శాతం సీట్లు సాధించడమే ప్రధాన ఎజెండాగా సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో బీసీ గర్జన సభ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ తెలిపారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో బీసీ గర్జన సభ వాల్‌పోస్టర్లను స్థానిక మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతితో కలిసి బీసీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలైనా బీసీలకు 60 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజలు బీసీ అభ్యర్థులకే ఓటేసి గెలిపించాలని ఆకాంక్షించారు. బీసీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో తలపెట్టిన బీసీ గర్జనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమౌళి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు అరగంటి నాగరాజు గౌడ్, తౌటం రవీందర్, కాశగాని అశోక్‌గౌడ్, తుమ్మల శోభరాణి, ఆముదాలపల్లి మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరిక



స్వరూపకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే సతీష్

ఎల్కతుర్తి : అభివృద్ధికి ఆకర్షితులై టీఆర్‌ఎస్ చేరినట్లు ఎంపీటీసీ బొల్లెడ్ల స్వరూప, నాయకుడు సమ్మిరెడ్డి తెలిపారు. మండలంలోని జీల్గుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ స్వరూప, సీనియర్ నాయకుడు సమ్మిరెడ్డి హైదరాబాద్‌లోని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ నివాసంలో బీఆర్‌ఎస్‌లో సోమవారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే సతీష్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీటీసీ స్వరూప, నాయకుడు సమ్మిరెడ్డి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలౌతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న క్రమంలోనే తాము బీఆర్‌ఎస్‌లో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తంగెడ రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హక్కుల సాధనే లక్ష్యం



సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులతో ప్రభాకర్‌రెడ్డి

ధర్మసాగర్ : ఉపాధ్యాయుల హక్కుల సాధనే పీఆర్టీయూ లక్ష్యమని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో సుదీర్ఘ పోరాటాలు నిర్మించి 30 శాతం పీఆర్సీని, 12 నెలల వేతనం, మహిళా ఉపాధ్యాయులకు ప్రసూతి సెలవులు సాధించినట్లు తెలిపారు. ఏటా కాంట్రాక్టు ముగిసిన అనంతరం రాత పరీక్ష రాసే విధానాన్ని రద్దు చేయించామని చెప్పారు. త్వరలో మినిమం టైం స్కేల్ ఇప్పించడం, కేర్ టేకర్ నియామకం జరుగుతాయని వివరించారు. కేజీబీవీల్లోని ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సంఘం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, పీఆర్టీయూ జిల్లా శాఖ ప్రతినిధి మాధవి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సుమాదేవి, మల్లారెడ్డి, రాంచంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండ రమేష్, కేశవరెడ్డి, జిల్లా సహ అధ్యక్షుడు సమ్మయ్య, ఇస్మాయిల్, సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



పిండి గిర్నిని ప్రారంభిస్తున్న ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి

సంగెం : మహిళలు కుటీర పరిశ్రమలు స్థాపించి స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తీగరాజుపల్లిలో సంగెం యూనియన్ బ్యాంకు పీఎంఎఫ్‌ఎంఈ పథకం ద్వారా రూ.2లక్షల ఆర్థిక సాయంతో లబ్దిదారు హింగె సుజాత ఏర్పాటు చేసిన పిండి గిర్ని తదితర యంత్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్జుగుత్త రమగోపాల్, ఎంపీటీసీ రంగరాజు నర్సింహస్వామి, యూనియన్ బ్యాంకు మేనేజర్ యాకర అనిల్, డీపీఎం భవానీ, ఏపీఎం దుంపేటి కిషన్, సీసీలు రాజయ్య, కృష్ణమూర్తి, వీఓఏలు విజయ్, కోమలత, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.